
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 29 సెప్టెంబరు 2025



ఆదిత్యుడి ఆదాయం రూ.5.49లక్షలు

అరసవల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. కేశఖండనశాల, ఇంద్ర పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం ఒక్కరోజే ఆదిత్యుడికి రూ.5.49లక్షల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,78,800, విరాళాల రూపంలో రూ.66,718, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,04,040 సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.





శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం

249 పోస్టులు ఖాళీ

- శ్రీకాకుళం కార్పొరేషన్‌లో సిబ్బంది కొరత
- ఉండాల్సిన ఉద్యోగులు 408 మంది
- 159 మందితో నెట్టుకొస్తున్న వైనం
- అంతంతమాత్రంగానే ప్రగతి
- ర్యాంకింగ్‌లోనూ వెనుకబాటు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

శ్రీకాకుళం/అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పాలక సంస్థకు ఉద్యోగులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒకప్పుడు మునిసిపాలిటీగా ఉన్న శ్రీకాకుళానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో (2015లో) కార్పొరేషన్ హోదా కల్పించారు. అప్పటి నుంచి స్థాయి పెరిగినా.. పూర్తిస్థాయిలో ఉద్యోగులు మాత్రం లేరు. కనీసం యాభైశాతం కూడా సిబ్బంది లేకపోవడంతో ప్రగతి కుంటుపడుతోంది. కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించకపోవడం, పాలకవర్గం లేకపోవడం వల్ల కూడా అభివృద్ధికి అవరోధంగా మారింది. తాజాగా ప్రభుత్వం పది అంశాల ఆధారంగా రేటింగ్ ప్రకటించగా.. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు 78వ ర్యాంకు రావడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా సరిపడా సిబ్బంది నియామకంలో ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● అన్ని విభాగాల్లోనూ అంతే..

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో మొత్తం 408 మంది ఉద్యోగులకుగానూ కేవలం 159మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 249 పోస్టులు ఏళ్ల తరబడి నుంచి ఖాళీగానే ఉన్నాయి. సాధారణ పరిపాలన విభాగంలో 68మంది ఉద్యోగులకుగాను 35 మంది మాత్రమే ఉన్నారు. మేనేజర్, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ గ్రేడ్-3, రెవెన్యూ ఆఫీసర్, అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్స్ - 3, బిల్లు కలెక్టర్లు -6, ఆఫీస్ సబార్డినేటర్స్ -3, ఆయాస్ -1, టైపిస్టు -2, రికార్డు అసిస్టెంట్‌లు -3, నైట్‌వాచ్‌మన్, డ్రైవర్‌లు - 2, ట్రాక్టర్ డ్రైవర్‌లు, తోటీస్, స్వీపర్ (మిగతా 7వ పేజీలో..)

● జిల్లా కేంద్రంలో ఇలా ఉంటే..?

జిల్లాకేంద్రమైన శ్రీకాకుళంలో అరగంట వర్షం కురిస్తే చాలు.. గంటపాటు ప్రజలు మురుగునీటితో అవస్థలు పడే పరిస్థితి నెలకొంది. శతాబ్దాల నాటి డ్రైనేజీని పూర్తిగా ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. దీనికోసం ప్రతిపాదనలు.. ప్రణాళికలు పంపినా ఆచరణకు నోచుకోవడంలేదు. డ్రైనేజీ సమస్యను సరిదిద్దడం.. వార్డులను పరిశుభ్రంగా ఉంచడం.. డివిజన్లలో పారిశుధ్యం చర్యలతోపాటు రక్షిత నీరు అందించడం.. వీధిలైట్లు సరిచేయడం.. మార్కెట్‌ల పర్యవేక్షణ.. వీధికుక్కలను నియంత్రించడం.. రోడ్లపై ఆవులను నిర్మూలించడం.. వంటి బాధ్యతలన్నీ నగర పాలక సంస్థ అధికారులదే. కాగా అరకొర సిబ్బంది కారణంగా అధికా రుల పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రజలకు అంతంత మాత్రంగానే సేవలు అందుతున్నాయి. ఉన్న సిబ్బందిపై పని భారం పడుతుండగా.. ఆశించినస్థాయిలో ప్రగతి కనిపించడం లేదు. చాలా సమస్యలకు పరిష్కారం చూపడం లేదు.



శ్రీకాకుళంలో జలమయమైన రహదారి (ఫైల్)



లోకొండ గ్రామంలో గిరిజనుల నిరసన

రేషన్ కావాలంటే..
6 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

- లోకొండ గిరిజన పంచాయతీ ప్రజలకు తప్పని ఇబ్బందులు
- గ్రామంలోనే సరుకులు అందజేయాలని డిమాండ్

హిరమండలం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల కోసం గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. హిరమండలం మండలంలోని లోకొండ గిరిజన పంచాయతీ ప్రజలు రేషన్ సరుకులు కావాలంటే ఆరు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలోనే సరుకులు అందజేయాలంటూ ఆదివారం (మిగతా 6వ పేజీలో..)

మాక్‌టెస్ట్‌కు విశేష స్పందన



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

అరసవల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఎర్రన్న విద్యా సంకల్పం'లో భాగంగా ఆర్ఆర్‌బీ, గ్రూప్-డీ అభ్యర్థుల కోసం నిర్వహించిన మాక్‌టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. ఆదివారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన ఈ మాక్‌టెస్ట్‌కు 244మంది అభ్యర్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఆర్‌ఆర్‌బీ, గ్రూప్-డీ ప్రధాన పరీక్షకు సన్నద్ధమయ్యేలా ఈ కంప్యూటర్ ఆధారిత మాక్‌టెస్టును నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.



బొడ్డేపల్లిలో ఇసుక ర్యాంపు ఇదే..

అధికారం అండగా..

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- అనధికారికంగా ర్యాంపుల నిర్వహణ
- మొక్కుబడిగా అధికారుల తనిఖీలు

పొందూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. నాగావళి, వంశధార నదుల్లో ఉన్న ఇసుక.. ఇళ్ల నిర్మాణాలకు అత్యంత నాణ్యమైంది. దీంతో విశాఖపట్నంతోపాటు సుదూర ప్రాంతాలకు జిల్లా నుంచి రోజూ పదుల సంఖ్యల లారీల్లో ఇసుక తరలిపోతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ధరతో పోల్చితే.. ప్రస్తుతం సగానికి సగం తగ్గింది. ఈ నేపథ్యంలో ఇసుక వినియోగం పెరగ్గా.. అదేస్థాయిలో అక్రమ రవాణా సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక విక్రయాల పేరిట వినియోగదారులను దోచుకున్నారు. ఇసుక అధిక ధరకు విక్రయించడంతో సామాన్యులకు భారమై ఇళ్ల నిర్మాణాల సైతం నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం వినియోగదారులకు కొంత ఊరట కలిగించినా.. నిర్వాహకులకు మాత్రం కాసుల పంట పండిస్తోంది. నాగావళి, వంశధార నదీ తీర ప్రాంత గ్రామాల నాయకులకు ఇసుక ర్యాంపులు రూ.కోట్లు కురిపిస్తున్నాయి. అనధికారికంగా ర్యాంపులు నిర్వహిస్తూ, భారీ టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తూ అక్రమార్జన సాగిస్తున్నారు. ప్రభుత్వం మారినా.. ఇసుకాసురుల అక్రమాలు మాత్రం ఆగడం లేదు. ర్యాంపుల నిర్వాహకుల నుంచి కొంతమంది అధికారులు మామూళ్లు తీసుకుని.. అక్రమాలు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారపార్టీ నాయకుల అనుచరుల ఆధ్వర్యంలో ర్యాంపులు నిర్వహిస్తుండడంతో.. తమకెందుకులే అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పొందూరు మండలంలోని సింగూరు, బొడ్డేపల్లి, నెల్లిమెట్ట, బెలమాం నదీ తీర ప్రాంతాల్లో అనధికార ఇసుక ర్యాంపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కూటమి నేతలు ఈ ర్యాంపులు నిర్వహిస్తున్నారు. వీటి నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. కింతలి నుంచి మొదలవలస వరకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఎక్కడికక్కడ నిల్వ చేస్తున్నారు. వాటిని టిప్పర్లకు లోడ్ చేసి.. విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ర్యాంపుల నిర్వహణ విషయం మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలిసినా, నిర్వాహకులు అధికారపార్టీ నేతలు కావడంతో తనిఖీలు చేసేందుకు వెనుకాడుతున్నారు. అనధికార ర్యాంపులను అడ్డుకునే సాహసం చేయడం లేదు. పైగా కొంత మంది అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. అప్పుడప్పుడూ ఇసుక ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి మమ అనిపిస్తున్నారు తప్ప.. ఇంతవరకూ ర్యాంపుల నిర్వాహకులపై కేసులు పెట్టిన దాఖలాలు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నెల్లిమెట్టలో ఉన్న భారీ ఇసుక నిల్వలు

● ఆధిపత్యంలో భాగంగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో అనధికారిక ఇసుక ర్యాంపులపై ఇన్నాళ్లూ అధికారులు కన్నెత్తి చూడలేదు. కాగా.. బుధవారం మాత్రం పొందూరు మండలం బొడ్డేపల్లిలో అనధికార ఇసుక ర్యాంపు, ఇసుక అక్రమ నిల్వలపై ఏకకాలంలో దాడులు చేశారు. మొత్తం 17 వాహనాలను సీజ్ చేయడం చర్చనీయాంశమైంది. కాగా కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే (మిగతా 7వ పేజీలో..)

● ఈ విషయమై మైనింగ్‌శాఖ డీడీ మోహనరావు వద్ద ప్రస్తావించగా.. 'జిల్లాలో అనధికారిక ఇసుక ర్యాంపులపై చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామ'ని తెలిపారు.

అడవిపంది వేట

● ముగ్గురిపై కేసు నమోదు

హిరమండలం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అడవిపందిని వేటాడిన నేపథ్యంలో ముగ్గురిపై కేసు నమోదు చేశామని పాతపట్నం అటవీశాఖ అధికారి అమ్మన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వన్యప్రాణుల వేటాడడం నేరం. వేటాడిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటాం. ఇటీవల సారవకోట మండలం మాలువ పరిధిలో హిరమండలం మండలం అవలంగి గ్రామానికి చెందిన లోకేష్, తుంగతంపరకి చెందిన సీహెచ్ లక్ష్మణరావు, జి.లక్ష్మణరావు అడవిపంది మాంసంతో పట్టుపడ్డారు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ'ని అమ్మన్నాయుడు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

టెక్కలి రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం బన్నువాడ గ్రామానికి చెందిన వట్టుకుళ్ల కూర్మారావు అనే రైతు పాముకాటుకు గురై మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం వరి పొలంలో ఎరువు చల్లేందుకు కూర్మారావు వెళ్లాడు. ఆ సమయంలో పాముకాటు వేయగా.. అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు టెక్కలిలోని జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో భార్య సరస్వతి, కుమార్తె బోరున విలపించారు.



కూర్మారావు (ఫైల్)



మృత్యు పిడుగులు!

- జిల్లాలో పెరుగుతున్న పిడుగుపాటు మృతులు
- బాధిత కుటుంబాలకు అందని పరిహారం
- చంద్రన్న బీమా పునరుద్ధరించాలని విజ్ఞప్తి

● ఈ నెల 23న పిడుగుపాటుకు గురై కంచిలి మండలం జాడుపూడి గ్రామానికి చెందిన రెయ్యి మృతి చెందారు. వరి పొలాల్లో కలుపుతీస్తుండగా పిడుగు పడడంతో ప్రాణాలు కోల్పోయారు.

● నాలుగు రోజుల కిందట కంచిలి మండలం డోల గోవిందపురం వద్ద పిడుగుపాటుకు గురై నాలుగు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. రెండు గొర్రెలు, రెండు మేకలు చనిపోయాయి.

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పిడుగులు వణికిస్తున్నాయి. ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఈ ఏడాది వేసవి నుంచి పిడుగుల మోత కొనసాగుతోంది. ఇటీవల పిడుగుపాటుకుగురై రైతులు, రైతు కూలీలే ఎక్కువగా మృత్యువాతపడ్డారు. మూగజీవాలు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం పొలాల్లో ఎరువులు వేయడం, కలుపు తీయడం వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో కొంతమందిని పిడుగులు బలిగొంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా పిడుగుల అపాయం నుంచి ముప్పు తప్పించలేకపోతున్నారు. మరోవైపు మృతుల కుటుంబాలకు పరిహారం దక్కడం లేదు. వైసీపీ పాలనలో జిల్లాలో వందలాది మంది పిడుగుపాటుకు గురై మృతిచెందినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఏ ఒక్కరికీ పూర్తిస్థాయిలో సాయం అందిన దాఖలాలు లేవు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా పరిహారాన్ని పునరుద్ధరించలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం చంద్రన్న బీమా పేరిట పది రోజుల్లో మృతుల కుటుంబాలకు పరిహారం అందించేవారు. వాస్తవానికి పిడుగుపాటుతో మృతిచెందితే రూ.4లక్షల పరిహారం అందించాలి. ఒకవేళ 60 శాతం వైకల్యం దాటితే రూ.2 లక్షలు, 60 శాతంలోపు ఉంటే రూ.59 వేలు పరిహారంగా ఇవ్వాలి. అధికారులు నివేదికలు అందిస్తున్నా.. పరిహారం మాత్రం దక్కడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేయాలని కోరుతున్నారు. చంద్రన్న బీమా అయినా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● పాపం కాపరులు..

సాధారణంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ పిడుగుల తీవ్రత అధికంగా ఉంటుంది. ఏటా ఏప్రిల్ నాటికి రబీకి సంబంధించి పంటలు పూర్తవుతాయి. ఆ సమయంలో మేకలు, గొర్రెలు, ఆవులు మందలు వేసేందుకు పొలాలు అనుకూలం. పగలంతా పొలాల్లో మేతలు పెడతారు. రాత్రికి అక్కడే మందలు వేస్తారు. ఎంతటి వర్షమైనా.. ఉరుములు, మెరుపులు వచ్చిన పశువుల వద్దే కాపరులు ఉండాలి. ఆ సమయంలోనే ఎక్కువగా పిడుగుపాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతులు, గొర్రెల పెంపకందారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ పిడుగుపాటు ప్రమాదాలను ముందుగానే పసిగట్టి సమాచారం ఇస్తోంది. 'వజ్రపాత్' యాప్ ద్వారా అప్రమత్తం చేస్తున్నా ఫలితం లేకపోతోంది. గొర్రెల పెంపకందారులకు స్మార్ట్ ఫోన్లు ఇచ్చి అవగాహన కల్పిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అరచేతిలో ప్రాణాలు..

పొలంలో మందలు వేసే సమయంలో మా ఆందోళన అంతాఇంతా కాదు. పశువులను పొలాల్లో విడిచిపెట్టి రావడం కుదరని పని. ఆ సమయంలో వర్షాలకు, ఈదురుగాలులకు వణికిపోతాం. మెరుపులు, ఉరుముల సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటాం. దేవుడి మీదే భారం వేస్తాం. అందుకే చాలామంది పశువుల పెంపకానికి దూరమవుతున్నారు.

-నర్తు సోమయ్య, గొర్రెల కాపరి, ఇచ్ఛాపురం



శాకంబరిదేవిగా ఉజ్జిడమ్మ తల్లి

జలుమూరు(సారవకోట), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సారవకోటలో కొలువుదీరిన ఉజ్జిడమ్మతల్లి ఆదివారం శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ఉజ్జిడమ్మను ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మ శాకంబరిదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



ధనలక్ష్మిగా నీలమణిదేవి

సారవకోట మండలం అవలింగి గ్రామంలో నీలమణిదేవి ఆదివారం ధనలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నీలమణిదేవిని ఆలయ అర్చకుడు భాస్కరరావు ధనలక్ష్మి రూపంలో అలంకరించారు. అవలంగితోపాటు బుడితి, చీడిపూడి తదితర గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు.

అధ్వానంగా పారిశ్రామికవాడ

- రహదారులు ధ్వంసం.. పూడుకుపోయిన కాలువలు
- కానరాని కనీస వసతులు

6లో

అధ్వానంగా పారిశ్రామికవాడ

- రహదారులు ధ్వంసం.. పూడుకుపోయిన కాలువలు
- కానరాని కనీస వసతులు


పారిశ్రామికవాడకు వెళ్లే రహదారి దుస్థితి

పలాస, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంగిలిగాం పారిశ్రామికవాడలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందిపడుతున్నారు. అభివృద్ధి పనుల కోసం ఏటా వ్యాపారుల నుంచి పన్నుల రూపంలో నిధులు వసూళ్లు చేస్తున్నా అందులో ఒక్క పైసా కూడా ఖర్చు చేయకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కనీసం తమ నుంచి వసూళ్లు చేస్తున్న నిధులతోనైనా అభివృద్ధి చేయండని డిమాండ్ చేస్తున్నా ఏపీఐఐసీ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం విశేషం.

పలాసకు రెండు కిలోమీటర్ల దూరంలో ఇంగిలిగాం పారిశ్రామికవాడ 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పారిశ్రామికవాడలో జీడి పరిశ్రమలు, జీడి ఆయిల్ పరిశ్రమలు, కర్రల మిల్లులు ఉన్నాయి. నిత్యం వేలాదిమంది కార్మికులు, వందలాది వ్యాపారులకు ఉపాధి కేంద్రంగా ఉన్నాయి. పారిశ్రామికవాడను ఏపీఐఐసీ ఆధీనంలో నిర్వహిస్తున్నారు. వారి ఆధ్వర్యంలోనే రహదారులు, కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి వ్యాపారులకు అన్నివిధాలా సహాయకారిగా ఉండాలి. కానీ అధికారులు మాత్రం తూతూమంత్రంగా అభివృద్ధి చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం పారిశ్రామికవాడలో ఏ ప్రాంతంలో కూడా రహదారులు బాగోలేవు. ప్రారంభంలోనే రోడ్డు పూర్తిగా పాడవగా, వెనుకభాగంలో రంధ్రాలు ఏర్పడి వర్షం పడితే ఏది రోడ్డో, ఏది కాలువ అనేది తెలియక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఓ వ్యాపారికి చెందిన వ్యాను రంధ్రాల్లో కూరుకుపోయి భారీగా నష్టం ఏర్పడింది. దీంతో పాటుగా పక్కా మురుగు కాలువలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి నిర్వహణ లేకపోవడంతో కాలువలన్నీ పూడుకుపోయాయి. తాగునీరు వసతి పూర్తిగా లేకపోవడంతో వ్యాపారులే తమ పరిశ్రమల్లో బోర్లు వేసుకొని కార్మికులకు తాగునీరు అందిస్తున్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ కొరత కూడా తీవ్రంగా ఉంది. నిత్యమూ మరమ్మతులకు గురై ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. తమకు సరైన వసతులు లేవని వ్యాపారులు కోరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కొత్తగా పారిశ్రామికవాడ ఏర్పాటు చేసి వ్యాపారులకు అందిస్తామని అధికారులు చెబుతుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిబంధనలు ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కాలువలు, రోడ్ల నిర్వహణ సక్రమంగా లేవు. ఉన్నవి పాడవడంతో తమ వాహనాలు పారిశ్రామికవాడలోకి రావడానికి ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

- మల్లా రామేశ్వరరావు, అధ్యక్షుడు, పారిశ్రామికవాడ వ్యాపారుల సంఘం

బాధ్యత తీసుకోవాలి

అధికారులు బాధ్యత తీసుకొని అభివృద్ధి చేయాలి. పన్నుల రూపంలో వచ్చిన నిధులు వెచ్చిస్తే ఇతరులపై ఆధారపడకుండా పారిశ్రామికవాడలో అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చు. కానీ పట్టించుకోవడం లేదు. గతంలో కూడా ఇదే అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది.

- తూముల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి, పారిశ్రామికవాడ వ్యాపారుల సంఘం

నర్సిపురం కాలనీ రోడ్డుకు మోక్షమేదీ?


అధ్వానంగా నర్సిపురం కాలనీ రహదారి

కాశీబుగ్గ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసి పాలిటీ పరిధిలో గల 8వ వార్డు నర్సిపురం కాలనీ రోడ్డుకు మోక్షం ఎప్పుడో? అని స్థానిక వార్డు వాసు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాశీబుగ్గ రైల్వే స్టేషన్‌కు ఆనుకొని ఉన్న నర్సిపురం కాలనీలో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. ఇప్పటికి కూడా మట్టి, కంకర రోడ్లు మీదే ప్రయాణం సాగిస్తున్నారు. దారి పొడవునా రాళ్లు.. గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదా రులు, పాదచారులు రాకపోకలు ఇబ్బందిపడుతున్నారు. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. కొన్నిసార్లు ఈ గుంతల్లో పలువురు పడిపోయిన ఘటనలు ఉన్నాయి.

ప్రభుత్వంపైనే ఆశలు

ఈ రోడ్డు కూటమి ప్రభుత్వం బాగుచేస్తుందని ఆశగా ఉంది. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సమస్యతో ఇబ్బందిపడుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నాం.

- హెచ్.సురేష్, స్థానికుడు

కాలనీకి దారేలేదు..

నర్సీపురం కాలనీకు దారేలేదు. పిల్లలతో స్కూల్‌కి గాని, బయటకుగాని వెళ్లాలంటే నరకయాతన పడుతున్నాం. వర్షం కురిస్తే రోడ్లు అన్ని జలమయం అవ్వడంతో ఇబ్బంది పడుతున్నాం. కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలి.

- జి.పద్మ, కాలనీవాసి

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


చికిత్స పొందుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రామలక్ష్మణ కూడలి నుంచి సూర్యమహల్ జంక్షన్ రోడ్డుపై ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి కాలూరి వెంకట నరసింగరావు బొలెరో వాహనం నడుపుతూ వచ్చి ఆ వ్యక్తిని ఢీకొని ఆపకుండా వెళ్లిపోయాడు. తీవ్రగాయాలైన ఆ వ్యక్తిని స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకన్న ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరా ఆధారంగా ఢీకొన్న వాహనాన్ని గుర్తించి డ్రైవింగ్ చేస్తున్న నరసింగరావును పట్టుకుని కేసు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తికి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించేందుకు సిద్ధమవుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి నీలం రంగు గళ్ల లుంగీ, షర్ట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసినవారు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


దామోదరరావు (ఫైల్)

నరసన్నపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్ము జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బమ్మిడి దామోదరరావు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 27న స్థానిక ఒక హోటల్‌లో పని చేస్తున్న దామోదరరావు డ్యూటీ ముగించుకుని స్వగ్రామం పోలాకి మండలం గాతలవలస వెళ్తుండగా.. టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దామోదరావును శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

రణస్థలం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె సావిత్రి రెండురోజులుగా కనిపించడం లేదని నగరప్పాలేనికి చెందిన తల్లి ఎం.పుష్ప ఆదివారం జేఆర్ పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కి గాయాలు

హరిపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మందస మండలం బాలిగాం వద్ద జాతీయ రహదారిపై కొబ్బరి బొండాలతో వెళ్తున్న బొలెరో వ్యాన్ ఆదివారం రాత్రి బోల్తాపడింది. చీపురుపల్లి నుంచి సంబల్పూర్‌కు వెళ్తున్న ఈ వ్యాన్ ప్రమాదంలో డ్రైవర్ రాజు గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని హరిపురం ఆసుపత్రిలో చికిత్స చేయించగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సింగుపురం గ్రామంలో ప్రధాన రహదారి సమీపంలోని ఒక షెడ్డులో ఆదివారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,810 నగదును, 5 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కడపలగెడ్డ రోడ్డుకు మరమ్మతులు



ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య కడపలగెడ్డపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది. ఆ సమయంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా పక్క నుంచి ప్రత్యమ్నాయంగా తాత్కాలికంగా రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు మళ్లీ ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఆయా గ్రామస్థులు తాము పడుతున్న అవస్థలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు సంబంధిత కాంట్రాక్టరు ద్వారా ఆదివారం మరమ్మతులు చేయించారు. దీంతో దబ్బపాడు గ్రామస్థులతోపాటు ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పలాస/కాశీబుగ్గ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం సాధ్యమని ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిర్ల రాజశేఖర్ అన్నారు. పలాస రైల్వే గ్రౌండ్‌లో ఆదివార అండర్-12 ఇంటర్‌స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సిర్ల రాజశేఖర్ మాట్లాడుతూ చదువుతోపాటు ఆటలపై దృష్టిసారించాలన్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, ఈస్‌కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ నాయకులు పీపీ రావు తదితరులు పాల్గొన్నారు.

'న్యాయసహాయం విద్య'పై జాతీయస్థాయి పోటీలు

శ్రీకాకుళం లీగల్ సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయన్యాయ సేవల ప్రాధికారసంస్థ (నల్సా) ఆధ్వర్యంలో 'అందరికీ న్యాయం-న్యాయ సహాయం దృష్టిలో' అనే అంశంపై పలు విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, స్కెచ్ విభాగాల్లో ఉంటాయన్నారు. వీటితో పాటు ఒక నిముషం నిడివి కలిగిన లఘు చిత్రాల పోటీలకు కూడా ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన అంశంతో పాటు, గౌరవంతో జీవన హక్కు, రోజు వారి జీవితంలో న్యాయం, న్యాయానికి దారితీసే మార్గాలు, భవిష్యత్తు దిశగా న్యాయ సహాయం అనే నాలుగు ఉప అంశాలపై కూడా ఎంట్రీలు సమర్పించవచ్చని, ఈ పోటీలో పాల్గొనేందుకు వయసుతో సంబంధం లేదని ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. ఎంట్రీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయానికి అక్టోబరు 4వ తేదీలోగా పంపాలని, అందులో ఉత్తమంగా ఎంపికైన మూడింటిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని ఆయన తెలిపారు.

హిందీ భాషా సమస్యలపై లేఖలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): హిందీ భాషకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హిందీ ప్రచారకులు, ఉపాధ్యాయులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు సుమారు 200 లేఖలు రాసి ఆదివారం పోస్టు చేశారు. ప్రాథమిక స్థాయి నుండే హిందీ బోధించాలని, ఒరియా మాధ్యమం విద్యార్థులకు ఆప్షన్‌గా హిందీని ప్రవేశ పెట్టాలని, పదో తరగతిలో ఇతర సబ్జెక్టుల్లా హిందీ భాషకు కూడా పరీక్షల్లో 35మార్కులకు పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావుకొండా శంకర్‌రెడ్డి, నిరం జన్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

టెక్కలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ మండల అధ్యక్షుడు, కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జాన రామ్‌జీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమలో పార్టీ నాయకులు అట్టాడ రవిబాబ్జీ, నడుపూరి లక్ష్మీనారాయణ, కొర్ర బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటిగుంతల్లా.. మిరియాపల్లి రోడ్డు


నీటిగుంతలను తలపిస్తున్న మిరియాపల్లి రోడ్డు

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మిరియాపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు నీటి గుంతలను తలపిస్తుంది. దీంతో రాకపోకలకు నరకయాతన పడుతున్నామని ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే వాడవలస, లక్ష్మీనర్సుపేట, దబ్బపాడు గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సుమారు పదేళ్ల నుంచి ఈ రోడ్డు మరమ్మతులకు గురై పెద్దపెద్ద గుంతలుగా తయారై రాళ్లపోగులుగా ఏర్పడడంతో వర్షాకాలంలో నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది.


గోతులమయంగా భర్తుపురం రహదారి

అధ్వాన రోడ్లతో అవస్థలు

నందిగాం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా మారడంతో అవస్థలు పడుతున్నారు. ఇటీవల పడుతున్న వర్షాలతో రహదారుల్లో వర్షపునీరు చేరి గోతులమయమై నరకాన్ని తలపిస్తున్నాయి. మదనాపురం రోడ్డు నుంచి భర్తుపురం, నౌగాం నుంచి మదనాపురం, కైజోల నుంచి హీరాపురం వయా నవరరామకృష్ణాపురం, హర్షబాడ, కర్లపూడి నుంచి బెల్లుకోల ఇలా పలు రహదారులు ప్రమాదకరంగా తయారయ్యాయి.

నీలమణిదుర్గ ఆలయ అభివృద్ధికి కృషి


మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే, ప్రివిలైజ్ కమిటీ సభ్యుడు మామిడి గోవిందరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని రాజధాని అమరావతిలో ఆయన కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తొలివిడతగా మంత్రి రూ.50లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. అలాగే నియోజకవర్గపరిధిలోని వివిధ ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరినట్టు తెలిపారు.

రేబీస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రేబీస్‌వ్యాధి సోకకుండా అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రపంచ రేబీస్ వ్యతిరేక దినం సందర్భంగా కుక్కలకు టీకాలను వేశారు. ఈ సందర్భంగా కుక్కల పెంపకదారులతో మాట్లాడుతూ.. పిచ్చికుక్క కరిచినా దాని లాలాజలం మనకున్న గాయాలపై పడినా వ్యాధిసోకుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది ఒ కుమారి ఎస్ శ్యాం సుందరరావు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ సంఘ కార్యవర్గం



నరసన్నపేట, సెప్టెంబరు 28(ఆంధ్ర జ్యోతి): జిల్లా జూనియర్ కళాశాల లెక్చరర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా హెచ్.మల్లేసు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా బి.వెంకట్ మోహన్, కార్యదర్శిగా ఎస్. రమేష్, జాయింట్ సెక్రటరీగా పి.ప్రసాదరావు, సభ్యులుగా ఎ.ధనుంజయరావు, సయ్యదా భాను, వైవీ కృష్ణ మూర్తిలను ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి కె.నారాయణరావు తెలిపారు. ఈ కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగిందన్నారు.

దేశసేవలో ఫిరంగ దళం సేవలు శ్లాఘనీయం

నరసన్నపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశసేవలో ఫిరంగ దళం సేవలు అందించిన సేవలు అజరామమని రిటైర్డు ఫిరంగదళ ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు సత్యనారాయణ, సాంబశివరావు అన్నారు. ఆదివారం ఒక కల్యాణ మండపంలో 199వ ఫిరంగ దళ దినోత్సవం నిర్వహించారు. సంఘ నాయకులు ఆరంగి ఆనందరావు, చల్ల వైకుంఠరావు, సూర్యనారాయణ, సూరపు సురేష్, పి.రామమూర్తి, పల్లి సింహాచలం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంశధార నీటి సాధనకు ఐక్యం కావాలి

హరిపురం, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): వంశధార నీటి సాధనకు రైతులంతా ఐక్యం కావాలని సాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు అన్నారు. మందస మండలం హరిపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంశధార నీటిని ఇచ్ఛాపురం వరకు పొడిగించేందుకు సీఎం చంద్రబాబు మదిలోని ఆలోచనని దీన్ని సాధించేందుకు అన్ని గ్రామాల రైతులు ముందుకు రావాలని కోరారు. దీనికిగాను పోస్టు కార్డు ఉద్యమం, పంచాయతీ తీర్మానాలకు ఇప్పటికే ప్రారంభించామన్నారు. ధర్మాపు వెంకటరావు, నల్ల హడ్డీ, వైకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

దిమిలికి బస్సు సౌకర్యం కల్పించాలి

కొత్తూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి మారుమూల ప్రాంతమైన దిమిలి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలిన ఆ గ్రామస్థులకు కోరుతున్నారు. వివిధ పనులపై మండల కేంద్రానికి రావాలంటే ఒడిశా మీదుగా రెండు బస్సులు మారాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిమిలి వరకు బస్సు నడిపితే కాకరగూడ, అల్తి, మాకవరం, పొనుటూరు, కుద్దిగాం, రాయల, బంకి ఇతర గ్రామాలకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సును పునఃద్ధరించాలని కోరుతున్నారు.

అ'పూర్వ' కలయిక



గార, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. నాడు చదువుచెప్పిన ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

మెళియాపుట్టి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదర్థాలకు బానిస కావద్దని ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం చాపర, జాడుపల్లిలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఐక్యపోరాటాలతోనే హక్కులు సాధ్యం

మందస, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఐక్యపోరాటాలతోనే హక్కులు సాధ్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. మందసలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. దోపిడీకి గురవుతున్న జీడి, రైస్‌మిల్లు కార్మికులు హక్కులను కాపాడుకునేందుకు పోరాటం చేయాలన్నారు. సమావేశంలో పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఏర్పాటు ప్రస్తావనపై హర్షం

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ ఏర్పాటుకు అసెంబ్లీలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రస్తావించడం హర్షనీయమని టీడీపీ నాయకులు అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.మనోహర్‌నాయుడు అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలం ఏర్పాటు అయిన నుంచి చాలా ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడం ప్రజల ఇబ్బంది పడేవారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన పోలీసు స్టేషన్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే ప్రస్తావించడం సంతోషకరమన్నారు. వంశధార ప్రాజెక్టు జిల్లా వైస్ చైర్మన్ వి.ఆనందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.మన్మథరావు, నాయకులు ఎ.పోలినాయుడు, వి.గోవిందరావు, ఎస్.తేజేశ్వరరావు, జె.మోహనరావు, టి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ సమావేశం

టెక్కలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు ఈవో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు సర్పంచ్ గొండేల సుజాత అధ్యక్షతన జరుగుతుందని, ఈ సమావేశానికి వార్డు సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఇటీవల నిర్వహించిన వేలంపాటలో వచ్చిన పాటలను పరిశీలించి ఆమోదించే నిమిత్తం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

టెక్కలి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అన్యాయానికి గురైన వైసీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ నిలుస్తుందని వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధికి నిధులు హర్షణీయం

ఆమదాలవలస, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పట్టణ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయడం హర్షణీయమని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ సభ్యుడు తోట రాము అన్నారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితవాడలు అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా నిధులు మంజూరు చేశారన్నారు. సంఘ నాయకులు పొన్నాడ అప్పలసూరి, గుర్రాల చినబాబు, నవలాపురపు రాజారావు పాల్గొన్నారు.

రేషన్ కావాలంటే.. 6 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

(ఐదో పేజీ తరువాయి)

లోకొండలో గిరిజనులు నిరసన చేపట్టారు. లోకొండ పంచాయతీలో లోకొండ, మామిడిజోల, ముగడపేట, గోడిపాడు, పూలకొండ, తాళ్ళపాడు, లింగుపురం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన కార్డుదారులు రేషన్ సరుకుల కోసం భగీరథపురం వెళ్లాల్సి వస్తోంది. తమకు ఆరు కిలోమీటర్ల దూరంలో భగీరథపురానికి వెళ్లాలంటే నానా అగచాట్లు పడుతున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఆటో చార్జీల భారం తప్పడం లేదని పేర్కొంటున్నారు. తమ గ్రామాల్లోనే సబ్‌డిపోలు ఏర్పాటు చేసి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మహాచండీగా.. దుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ ఆదివారం మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ మండపాల్లో సామూహిక కుంకు పూజలు, లలిత పారాయణం చేపట్టారు. వివిధ సాంస్కృతికి కార్యక్రమాలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి, బృందం


వజ్రపుకొత్తూరు: మహాచండీ అలంకరణలో దుర్గమ్మ


అరసవల్లి: రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయంలో..


నందిగాం: దుర్గాదేవి వద్ద కుంకుమపూజలు నిర్వహిస్తున్న మహిళలు


పాతపట్నం: మహాచండీగా నీలమణిదుర్గ అమ్మవారు


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కూచిపూడి నృత్యప్రదర్శన


నరసన్నపేట: మాకివలస గ్రామంలో దీపాలంకరణ..

249 పోస్టులు ఖాళీ

(ఐదో పేజీ తరువాయి)

కమ్యూనిటీ ఆర్గనైజర్స్ -3, పబ్లిక్ వర్క్ మేస్త్రీ, సీనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

- ప్రజారోగ్యం విభాగంలో 209మంది ఉద్యోగులకుగాను 80 మందితో నెట్టుకొస్తున్నారు. ఇందులో అత్యధికంగా పబ్లిక్ హెల్త్ వర్కర్స్ 114 పోస్టులు ఖాళీ. పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు -6, మెటర్నటీ అసిస్టెంట్‌లు -2, హెల్త్ అసిస్టెంట్‌లు -2, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు -4, మెడికల్ ఆఫీసర్ ఒక పోస్టు ఖాళీగా ఉంది.
- అత్యంత కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగంలో 15 మంది ఉద్యోగులకుగాను 5 మందే ఉన్నారు. ఇందులో ఫౌంటైన్ క్లీనర్‌లు -2, చైన్‌మెన్ -2, టౌన్‌ప్లానింగ్ ట్రేసర్ -1, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ -3, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ - 2 పోస్టులు ఖాళీ.
- ఎడ్యుకేషన్-నాన్ టీచింగ్ స్టాఫ్ విభాగంలో 28 మందికిగానూ 10 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. నైట్ వాచర్స్ -2, స్వీపర్స్ -3, అటెండర్స్ -3, వాటర్ బోయ్ -1, వాటర్ ఉమెన్ -1, తోటీ -2, రికార్డు అసిస్టెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఇంజనీరింగ్ విభాగంలో పావువంతు సిబ్బంది మాత్రమే ఉన్నారు. 88 మంది సిబ్బందికి 29 మందితో నెట్టుకొస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌లు -2, రోడ్ రోలర్ డ్రైవర్ -1, ఎలక్ట్రీషియన్ గ్రేడ్-2 రెండు, మీటర్ రీడర్, పైపులైన్ ఫిట్టర్, లైటినింగ్ సూపరింటెండెంట్, డ్రైవర్(ఎల్‌వీ), ఫౌంటైన్ క్లీనర్ - 3, రోడ్ రోలర్ క్లీనర్ -1, ట్రాక్టర్ క్లీనర్ -3, రోడ్ మజ్దూర్ -2, హెల్పర్ -4, నాన్‌పబ్లిక్ హెల్త్ వర్కర్ -8, ఎవెన్యూ మజ్దూర్ -2, మేన్ మజ్దూర్ -6, వాటర్ వర్క్స్ వాచ్‌మన్ -1, అసిస్టెంట్ ఇంజనీర్ -1, గాంగ్ మజ్దూర్ -9, పార్క్ వాచర్ -1, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ -2, టీ.బీ వాచర్, ఉమెన్ మజ్దూర్, క్లీనర్స్ వాటర్ సప్లయ్, బోర్‌వెల్ మజ్దూర్స్, బోర్‌వెల్ హెల్పర్స్ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

78వ ర్యాంకుకు పరిమితం..

రాష్ట్ర ప్రభుత్వం పది అంశాల ఆధారంగా మునిసిపాలిటీలకు ర్యాంకులు ప్రకటించింది. తాగునీటి సరఫరా, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాలు, వరద నీటి నిర్వహణ, రోడ్లు, వీధి దీపాలు, ఆదాయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రేటింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో 123 మునిసిపాలిటీలు ఉండగా.. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు 78వ ర్యాంకు లభించింది. మొత్తం 100 మార్కులకుగానూ 50 పాయింట్లతో మధ్యస్థంగా 5వ రేటింగ్ దక్కింది. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో వివిధ విభాగాలకు సంబంధించి లభించిన స్కోరును పరిశీలిస్తే.. నీటి సరఫరాకు-7, ఇంటి నుంచి చెత్త సేకరణకు- 6, లెగసీ వేస్ట్(వ్యర్థ నిర్వహణ)కు - 4, పక్కా రోడ్లకు - 10, వీధి లైటింగ్‌కు- 6, ఆదాయ విభాగంలో - 10, రెవెన్యూ విభాగంలో 10 పాయింట్లు వచ్చా యి. వేస్ట్ ప్రోసెసింగ్ స్కోర్, లిక్విడ్ వేస్ట్ స్కోర్, స్టార్మ్ వేస్ట్ స్కోర్ సున్నా లభించింది. ఇప్పటికైనా కార్పొరేషన్‌కు ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రజాప్రతినిధులు స్పందించి శ్రీకాకుళం కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులు, సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు పంపా లని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారం అండగా..

(ఐదో పేజీ తరువాయి)

ఈ దాడులు చేశారనే చర్చ సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే, జిల్లాకు చెందిన ఓ కీలకనేత మధ్య విభేదాలు ఇటీవల తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఓ కీలక నేత ఆదేశాలతోనే అధికారులు పొం దూరు మండలంలో ఇసుక ర్యాంపు, నిల్వలను తనిఖీ చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎరువుల తనిఖీ పేరుతో వచ్చిన జిల్లా అధికారి.. ఇసుక నిల్వలను తనిఖీ చేయడం, వెంటనే పోలీసు, మైనింగ్, విజిలెన్స్ అధికా రులకు సమాచారం ఇవ్వడం.. ఆ వెంటనే కలెక్టర్ నుంచి అదేరోజు ఐదు శాఖల అధికారులతో చర్యలకు ఆదేశించడం.. ఈ ఆరోపణలకు బలం చే కూరుస్తోంది. కాగా ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట వేయడం మంచిదే. కానీ, బుధవారం జరిగిన ఘటన నాయకుల మధ్య మరింత విభేదాలు పెంచే లా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్

అరసవల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్యోద్యమ విప్లవజ్వాల భగత్ సింగ్ అని, ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరం, స్మృతి వనంలో సర్దార్ భగత్‌సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశభక్తి యువతకు ఎప్పటికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జామి బీమ శంకర్, వేదవతి, శ్యాంప్రసాద్, కొంక్యాన వేణుగోపాల్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, మహిబుల్లాఖాన్, పైడి హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.



అరసవల్లి: భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గాంధీ మందిర ప్రతినిధులు

ఘనంగా భగత్ సింగ్ జయంతి

రణస్థలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ జయంతిని ఆదివారం నారువా గ్రామంలో టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ నిద్రబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పలువురు రైతులకు తువ్వాళ్లను పంపిణీ చేశారు. పలువురు స్థానికులు పాల్గొన్నారు.



రణస్థలం: నారువా గ్రామంలో..

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పాతపట్నం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ పోరాట పటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఆలాంధ్ర రోడ్ లోని ఆదర్శ పాఠశాలలో భగత్‌సింగ్ జయంతి హెచ్‌ఎం పి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి జాతీయ జెండా రంగులతో కూడిన నూలు పోగులేసి నివాళులర్పించారు. రిటైర్డు ఎంఈవో బి.సింహాచలం, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాతపట్నంలో..

నైపుణ్యం ఉంటేనే రాణింపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెమ్స్ సీవోవో శ్రీధర్ రెడ్డి

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో విద్యార్థ తలతో పాటు నైపుణ్యం ఉంటేనే రాణింపు ఉంటుందని జెమ్స్ సీవోవో శ్రీధర్ రెడ్డి అన్నారు. రాగోలు జెమ్స్‌లో బొల్లినేని బీఎస్సీ ఎలైడ్ అండ్, హెల్త్ కేర్ కళాశా లలో ఆదివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. బొల్లినేని మెడ్ స్కిల్స్ ఈడీ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇష్టబడి చదివితే మార్కులు సాధించ గలమని, ప్రతి విద్యార్థి రియల్ జెమ్స్‌గా తయారవ్వాలన్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెమ్స్ మెడికల్ డైరెక్టర్ డా.హేమంత్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జావా ఎజ్డీ షోరూం ప్రారంభం



జావా ఎజ్డీ షోరూంను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

అరసవల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం పెద్దపాడు రోడ్‌లో శ్రీ సూర్య ఆటో మోటార్స్ పేరుతో జావా ఎజ్డీ షోరూంను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతకు ఆకర్షణీయమైన విధంగా బైక్‌లు ఉన్నా యన్నారు. యజమాని బలగ సూర్యప్రతాప్ నాయుడు మాట్లాడుతూ.. జిల్లాలోనే ఇది మొదటి షోరూం అని అన్నారు. కార్యక్రమంలో బలగ కృష్ణారావు, చెంగళరావు, రాగోలు ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి శ్రీకాకుళం సమస్యలు: ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకు వెళ్లానని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల అనంతరం సీఎం వద్దకు వెళ్లి.. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించానన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియం పూర్తికినిధులు మంజూరుచేయాలని, ఆమదాలవలస-పాలకొండ రోడ్డు పూర్తి చేయాలని, కళింగపట్నం ప్యాసింజర్ జట్టీ నిర్మాణానికి నిధులు విడుదలయ్యేట్లు చేయాలని కోరానన్నారు. ఈ విషయాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని.. త్వరలో ప్రధాన సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



సీఎం చంద్రబాబుకు సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిత్యుని సేవలో విజయనగరం ఎస్పీ

అరసవల్లి/గార, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదరరావు దంపతులు ఆదివారం ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజ లు చేశారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తదితరులున్నారు. అలాగే శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామిని ఎస్పీ దామోదరరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించారు. ఈవో నరసింహనాయుడు స్వామి చిత్రపటాన్ని అందించారు. వారితో పాటు గార ఎస్ఐ సీహెచ్ గంగరాజు ఉన్నారు.



అరసవల్లి: ఎస్పీ దంపతులకు చిత్రపటాన్ని అందిస్తున్న ప్రధాన అర్చకుడు

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తన భర్త బత్తుల దుర్గాప్రసాద్ గత నెల 14 నుంచి కనిపించడం లేదని చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన అతని భార్య శ్యామల ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత నెల 14న ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లిన భర్త తిరిగి ఇంతవరకు రాలేదని, పది రోజుల తరువాత ఫోన్ చేసి తాను తిరుపతిలో ఉన్నానని, పని నిమిత్తం వచ్చానని చెప్పాడన్నారు. ఆ తరువాత అదే నెంబరుకు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదన్నారు. ప్రస్తుతం ఆ ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తోందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

న్యూస్ బాక్స్

వృథాగా తాగునీరు



వృథాగా పోతున్న తాగునీరు

గార రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోర్టు కళింగపట్నం పంచాయతీ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతున్న పైపులైన్ లీక్ అవడంతో తాగునీరు వృథా అవుతోంది. వమరవల్లి బాలికల గురుకుల పాఠశాల వెనుక ప్రత్యేక ప్యాకేజీ ద్వారా బోరు ఏర్పాటు చేసి గత పదిహేనేళ్లుగా తాగునీరంది స్తున్నారు. గడిచిన వారం రోజులుగా పైపులైన్ లీకై నీరు వృథా అవుతోంది. దీంతో గ్రామానికి తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీక్‌ను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలకు బీరువాల అందజేత

పొందూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కింతలి ప్రభుత్వం పాఠశాలలో 1990-91 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.30 వేలు విలువ చేసే బీరువాలను అందజేశారు. ఆదివారం హెచ్‌ఎం బి.గోవిందరావుకు వీటిని అందించారు. గ్రంథాలయంలో పుస్తకాలు భద్రపరిచేం దుకు వీటిని ఉపయోగించాలని కోరారు. పూర్వ విద్యార్థులు దుంపల శ్రీనివాసరావు, బెండి సూర్యనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) లొద్దపుట్టి గ్రామదేవత ధనరాజ తులసమ్మ తల్లికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముర్రాటలు సమర్పించారు. భవానీమాల వేసుకున్న మహిళల కోలాటం ఆకట్టుకుంది. పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



